క్లుప్తంగా

పరిశుభ్రతా చర్యలు చేపట్టాలి



మానమాల చెత్తసంపద కేంద్రంలో అధికారులు

ఓజిలి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ రవీంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని వెంకటరెడ్డిపాళెం, కొండవల్లిపాడు, మానమాల, కురుగొండ గ్రామాల్లోని చెత్తసంపద కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 కేంద్రాలను ఈ నెల 15వ తేదీ నుంచి వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రామాల్లో ప్రజలు చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా ప్రధాన కూడళ్లలో చెత్త కుండీల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రేణుక, పంచాయతీ కార్యదర్శులు వెంకయ్య, సుమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

రాపూరు: మండలంలోని కండలేరు గురుకులం, ఉన్నత పాఠశాల, వేపినాపి, పంగిలి, సిద్ధవరం పాఠశాలల్లో చదువుతున్న 49 మంది విద్యార్థులకు బుధవారం కంటి అద్దాల పంపిణీ చేసినట్లు వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ప్రమీల రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో 91 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించామని మొదటివిడతగా 49 మందికి అందించామని మరో విడతలో మిగిలిన వారికి పంపిణీ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు గురవయ్య, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


కోళ్ల మృతితో కలకలం

కోట: ప్రజలను బర్డ్‌ఫ్లూ భయం వెంటాడుతోంది. ఈ క్రమంలో కోటలోని ఓ చికెన్ దుకాణం వద్ద కోళ్లు మృతి చెందడం కలకలం సృష్టించింది. బుధవారం ఉదయం చికెన్ కోసం వెళ్లిన వారికి కోళ్లు మృతి చెంది ఉండడం కనిపించడంతో దుకాణదారులను ప్రశ్నించారు. దీంతో కొందరు కోళ్ల మృతిపై అధికారులకు ఫిర్యాదులు చేసి, ఫొటోలను సైతం పెట్టడంతో పశువైద్యుడు రాజేష్ తన బృందంతో కోళ్ల ఫారాలు, దుకాణాలను పరిశీలించారు. కోళ్లలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని డాక్టర్ రాజేష్ తెలిపారు. ఒక్క దుకాణదారుడి వద్దే 50 వరకు కోళ్లు మృతి చెందినట్లు గుర్తించామన్నారు. ఒక్కచోటే ఎక్కువ సంఖ్యలో కోళ్లను ఉంచడంతో ఆక్సిజన్ అందకపోవడంతో మృతి చెంది ఉండొచ్చన్నారు. పౌల్ట్రీఫారాలు నడుపుతున్న వ్యక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలి

ఓజిలి: చిన్నతనంలో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలని సీడీపీఓ ఉమామహేశ్వరి పేర్కొన్నారు. ఓజిలి ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ 0–6 సంవత్సరాల పిల్లలకు బొమ్మలతో కూడిన బోధన చేస్తే సులువుగా అర్థం చేసుకుంటారన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ కార్యకర్తలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కేంద్రాలకు పిల్లల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శైలజ, చంద్రశేఖర్, డీఆర్‌పీలు సుజనమ్మ, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.


ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడి మృతి



తులాబంధు వెంకట సుబ్రహ్మణ్యం (ఫైల్)

నాయుడుపేట టౌన్: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తులాబంధు వెంకట సుబ్రహ్మణ్యం (66) బుధవారం మృత్యువాత పడ్డారు. ఆయనకు ఆరోగ్యం సరిలేక బెంగళూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ సంఘం తిరుపతి, నెల్లూరు జిల్లాల రూరల్ అధ్యక్షులు గూడూరు కిషోర్‌కుమార్, కనమర్లపూడి సుబ్రమణి, సంఘ పెద్దలు పెసల జయరాజగోపాల్, కిషోర్‌బాబు, నాయకులు వెంకటేశ్వర్లు, గాధంశెట్టి భాస్కర్ సంతాపం వ్యక్తం చేశారు.

గిరిజనులను ఇబ్బంది పెట్టొద్దు



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

వెంకటగిరి రూరల్: డక్కిలి మండలం మోపూరు గ్రామానికి చెందిన గిరిజనులను పోలీసు, అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరించడం సబబు కాదని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ భూమి ఆక్రమణలకు గిరిజనులు పాల్పడుతున్నారని మోపూరు గ్రామంలో అటవీ శాఖ, పోలీసులు భారీగా మోహరించి వారిని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. గిరజనేతరులు అటవీ భూములు ఆక్రమించుకున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ మాట్లాడుతూ గిరిజనులపై అధికారులు వ్యవహరిస్తున్న శైలి సరైనది కాదన్నారు. గిరిజన సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షురాలు చెంబేటి ఉష తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అభివృద్ధికి చిరునామా



వెంకటగిరిని తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఎన్నో శాశ్వతమైన అభివృద్ధి సంస్థలను వెంకటగిరిలో నెలకొల్పారు అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి. నియోజకవర్గం వెనుకబడిందనే ఉద్దేశంతో పరిసర ప్రాంతాల్లో వివిధ సంస్థలను తీసుకొచ్చి స్థానిక ప్రజలకు ఉపయోగకారిగా నిలిచారాయన. ఒకటి, రెండుకాదు వెంకటగిరిని శాశ్వత అభివృద్ధి దిశగా తీసుకెళ్లారు.

– వెంకటగిరి రూరల్

- 9 వ బెటాలియన్, ఐఐహెచ్‌టీ, నిమ్మ పరిశోధన స్థానం ఏర్పాటు
- ఉపాధి కల్పనతో యువతకు ప్రోత్సాహం
- నేడు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి



నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి స్థాపించిన ఐఐహెచ్‌టీ

వెంకటగిరి నియోజకవర్గం నుండి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 1992లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పట్లోనే ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. సొంత నియోజకవర్గం పుట్టినింటితో సమానంగా భావించి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పలు శాశ్వతమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

చేనేతకు అండ

చేనేత కార్మికుల పనుల్లో కార్మికులు, వారి పిల్లలు రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న ఉద్దేశంతో భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన ఐఐహెచ్‌టీ(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ) వెంకటగిరిలో స్థాపించారు. భారతదేశంలో రెండోదిగా 25 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, మహారాష్ట్రతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. డిప్లొమా కోర్సుల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు.

నిమ్మ, చీనీ పరిశోధనా స్థానం



జనార్దన్‌రెడ్డి హయాంలో ఏర్పాటైన పెట్లూరు, నిమ్మ, చీనీ పరిశోధన స్థానం

రైతులను వరితోపాటు ఉద్యాన పంటల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వెంటగిరి రూరల్ మండలంలోని పెట్లూరు గ్రామంలో నిమ్మ, చీనీ పరిశోధన స్థానాన్ని 25 ఎకరాల్లో స్థాపించారు. నిమ్మ సాగులో యాజమాన్య పద్ధతులు, రైతులకు అధిక దిగుబడులు సాధించే దిశగా శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానంలో పుట్టిన బాలాజీ రకం నిమ్మ పంటకు మార్కెట్‌లో కూడా ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది.

బెటాలియన్ స్థాపన

వెంకటగిరి పరిసర ప్రాంత ప్రజలు సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతో వల్లివేడు సమీపంలో 9వ బెటాలియన్ ఏర్పాటుకు నేదురుమల్లి ఎంతో కృషి చేశారు. 9వ బెటాలియన్‌ను ఏర్పాటు చేసి పలు రాష్ట్రాల్లో సంభవించే విపత్తులను ఎదుర్కొంటూ, పోలీసు ట్రైనింగ్ కల్పిస్తూ ఎందరో ఉపాధి పొందుతున్నారు. బాలికల విద్యను ప్రోత్సహించే దిశగా వెంకటగిరి క్రాస్ రోడ్డు సమీపంలో 5 ఎకరాల్లో బాలికల గురుకుల పాఠశాలను స్థాపించారు. పట్టణంలోని ప్రధానంగా ఉన్న రాజావీధి, తూర్పువీధి, పాతబస్టాండ్, కాశీపేట, బజారువీధిలో ప్రధాన రోడ్లు నేదురుమల్లి హయాంలో ఏర్పాటు చేశారు. ఆ రోడ్లు నాటి నుండి నేటికీ చెక్కు చెదరకుండా ఆ రోడ్ల మీదనే పట్టణ వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇంకా ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల గుండెల్లో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.



వల్లివేడు సమీపంలో స్థాపించిన 9వ బెటాలియన్

నేడు నేదురుమల్లి జయంతి

వెంకటగిరి(సైదాపురం): దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని గురువారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో గురువారం నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తొలుత వెంకటగిరిలో నేదురుమల్లి నివాసంలో కార్యక్రమాల అనంతరం త్రిభువని సెంటర్ వద్ద ఉన్న నేదురుమల్లి విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెరువుల్లోకి చేప పిల్లలు

గూడూరు రూరల్: గూడూరు మండలంలోని నెల్లటూరు సమీపంలో ఉన్న రావిచెరువు, చెన్నూరు చెరువులో బుధవారం మత్స్యశాఖ ఆదేశాల మేరకు పీఎంఎంఎస్‌వై పథకం కింద చేప పిల్లలను మత్స్యశాఖ అధికారి మధు ఆధ్వర్యంలో వదిలారు. ఈ కార్యక్రమంలో రావినీటి సంఘం ఉపాధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్, వెంకటేశ్వరరాజు, నీటి సంఘం సభ్యుడు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదును వినియోగించుకోండి

గూడూరు రూరల్: మండల పరిధిలోని దివిపాళెం, వేములపాళెం, చవటపాళెం, పోటుపాళెం, పురిటిపాళెంతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని రైతులు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రమేష్ కోరారు. గురువారం ఈ గ్రామాల్లో జరగనున్న కార్యక్రమంలో రైతులు తమ పొలం 1బి, ఆధార్ కార్డు, ఆధార్‌కి లింకైన ఫోన్‌ను కచ్చితంగా తమ వెంట తీసుకురావాలని సూచించారు.

మద్దాలికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్: వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాలి సోమశేఖర్‌రెడ్డిని బుధవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. సోమశేఖర్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేటకు కారులో వస్తుండగా ప్రమాదవశాత్తు పెళ్లకూరు మండలం ఎగువ చావాలి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, వైఎస్ఆర్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కామిరెడ్డి సత్య నారాయణరెడ్డి, నాయకులతో కలిసి సోమశేఖర్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన క్షేమ సమాచారాన్ని తెలుసుకుని పరామర్శించారు. వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పాదర్తి హరినాథ్‌రెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, లింగారెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్ఆర్ సీపీ నేతకు పరామర్శ



యశోదమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట: విద్యానగర్‌కు చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు కూచివాడ పరంధామరెడ్డి తల్లి యశోదమ్మ ఇటీవల మృతి చెందింది. బుధవారం ఆయన నివాసంలో జరిగిన ఉత్తరక్రియలకు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హాజరయ్యారు. యశోదమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజారెడ్డి, రఘురామిరెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కమిషనర్ వెంకటరామిరెడ్డితో కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి రూరల్: వార్డు పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ వెంకటరామిరెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శంకరయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో శానిటేషన్, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. పలు వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతోందని, చర్యలు చేపట్టాలని కోరారు.

సత్తా చాటిన ఎన్‌సీసీ క్యాడెట్లు



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌సీసీ నావల్ యూనిట్ క్యాడెట్లను బుధవారం ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అభినందించారు. బీటెక్ సెకండియర్ చదువుతున్న ఎం.ప్రణీత్ ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు పి.గాయత్రి, ఎస్.హరిక్రిష్ణ అమరావతిలో రాష్ట్ర గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్ విద్యార్థులు కఠోర శిక్షణతో ఎన్‌సీసీలో జాతీయ స్థాయిలో రాణిస్తుండడం గర్వకారణమన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, పీడీ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు రుణాలు అందజేయాలి



బ్యాంకు మేనేజర్లతో ఎంపీడీఓ మనోహర్ గౌడ్

చిట్టమూరు: మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి మాత్రమే రుణాలు అందజేయాలని ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. చిట్టమూరు మండలంలో బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 23 మందికి రుణాలు అందజేయనున్నామన్నారు. అయితే మండలంలో ఉన్న 23 పంచాయతీలకు 23 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయన్నారు. అర్హులను గుర్తించి పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు. చిట్టమూరు, గునపాడు, మల్లాం బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని చలివేంద్రం గ్రామ సమీపంలో పత్రీజీ ధ్యాన ఆశ్రమంలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినట్లు సీఐ బాబీ బుధవారం వెల్లడించారు. మృతుడు చిత్తూరు జిల్లా రంగంపేట ప్రాంతానికి చెందిన చాంద్ బాషాగా గుర్తించారు. మృతుడు కుటుంబ సభ్యులను వదిలిపెట్టి నాయుడుపేటకు వచ్చేసినట్లుగా పోలీసులు తెలుసుకున్నారు. మృతుడి భార్య ఆయేషా కూడా కరోనా సమయంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి మృతి విషయం తెలుసుకున్న అతని కుమారుడు, కుమార్తె హుస్సేన్, ఫజులున్నీసా వచ్చి తండ్రి మృతదేహాన్ని కడసారి చూసుకున్నారు. అయితే నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో తండ్రి మృతదేహాన్ని తమ గ్రామానికి తీసుకెళ్లలేకపోయారు. దీంతో ఆశ్రమ నిర్వాహకుడు బలరామయ్య బుధవారం సాయంత్రం నాయుడుపేటలోనే చాంద్‌బాషా అంత్యక్రియలు నిర్వహించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో ఎగువచావాలి గ్రామం వద్ద బుధవారం ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. ఈ ఘటనలో వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాలి సోమశేఖర్ రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు శ్రీకాళహస్తిలో స్టోన్ క్రషర్ వద్ద పనులు ముగించుకొని తిరిగి నాయుడుపేటకు కారులో వెళుతున్నాడు. మార్గం మధ్యలో ఎగువచావాలి గ్రామం వద్ద ప్రమాదవశాత్తు కారు రోడ్డు పక్కన బోల్తా పడింది. స్థానికులు గుర్తించి కారులో నుండి సోమశేఖర్‌రెడ్డిని వెలుపలికి తీశారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో సోమశేఖర్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు.

బీసీ రుణాలకు పక్కాగా ఇంటర్వ్యూలు

సైదాపురం: మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రకాల రాయితీ రుణాలకు సంబంధించి పక్కాగా ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కలిచేడు, ఊటుకూరు, చాగనం, సైదాపురం బ్యాంకు పరిధిలో 43 యూనిట్స్ వివిధ పథకాలకు సంబంధించి రాయితీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ బ్యాంకు పరిధిలో 160 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి పక్కాగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత కలిగిన వారికి రాయితీ రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంకుడు గుంతలు పూర్తి చేయాలి

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వ్యర్థ జలాలను భూ గర్భంలోకి పంపేలా ఏర్పాటు చేసే ఇంకు డు గుంతలను త్వరితగతిన పూర్తి చేస్తా మని ఉపాధి ఏపీఓ గిరిబాబు తెలిపారు. మండలంలోని కలవకొండలో జరుగుతున్న ఇంకుడు గుంతలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 300కు పైగా మంజూరు చేశామన్నారు. అయినప్పటికీ సకాలంలో పూర్తి చేసేలా ఆయా గ్రామాల్లోని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌ల ద్వారా అవగాహన కల్పిస్తూ త్వరగా పనులు పూర్తి చేసేలా చూస్తున్నామని అన్నారు. ఇందుకు నగదు చెల్లింపులు కూడా లబ్ధిదారుల ఖాతాల్లోకి త్వరగానే పూర్తి చేసేలా చూస్తున్నామని అన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ నల్లయ్య ఉన్నారు.

అంగన్‌వాడీ దరఖాస్తుల పరిశీలన

చిల్లకూరు: ఐసీడీఎస్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్ల పోస్టులను భర్తీ చేసేందుకు గత నెలలో దరఖాస్తులు కోరారు. ఈ క్రమంలో బుధవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు పరిశీలన కార్యక్రమం చేపట్టారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. డివిజన్ పరిధిలోని గూడూరు, వెంకటగిరి, కోట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో వర్కర్లు 7 పోస్టులకు, 15 హెల్పర్ల పోస్టులకు దరఖాస్తులు కోరగా వర్కర్ల పోస్టులకు 52 మంది, హెల్పర్ల పోస్టులకు 44 మంది దరఖాస్తులు వేశారు. వీరంతా హాజరు కాగా గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించారు. వర్కర్లకు 27 మందిని, హెల్పర్లకు 37 మందిని ఎంపిక చేశారు. వీరిలో అర్హులకు త్వరలోనే కాల్‌లెటర్లు పంపుతామని సబ్‌కలెక్టర్ తెలిపారు. ఇన్‌చార్జ్ పీడీ వాసంతి, గూడూరు, కోట, వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓలు మహబూబీ, మునికుమారి, షంషాద్‌బేగం, చిల్లకూరు వైద్యాధికారి అరాఫత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల గురుభక్తి



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కోట: ఏవీకేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1980–81 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. తమ ప్రసంగాల్లో ఆనాటి అనుభవాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు చంద్రశేఖర్, శేషమ్మ, భాస్కర్‌రెడ్డిలను సన్మానించారు. పాఠశాలలో రూ.2 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను తమ గురువుల చేతులమీదుగా ప్రారంభించారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సురేంద్ర బాబు, పూర్వవిద్యార్థులు రమణబాబు, వల్లం సురేంద్ర, చంద్రప్రసాద్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాధయ్య మృతికి నేదురుమల్లి సంతాపం



నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: మండల కేంద్రమైన వాకాడు కైకాల వీధికి చెందిన సంగీతం రాధయ్య అనే ప్రభుత్వ విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యోగి బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వైఎస్ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అక్కడకు చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈయన వెంట నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, నేదురుమల్లి శ్రీధర్‌రెడ్డి, వంశీరెడ్డి, వెంకటేశ్వర్లు, గోపాలయ్య తదితరులు ఉన్నారు.

చేపల పెంపకంతో జీవనోపాధి



కడివేడు చెరువులోకి చేప పిల్ల వదులుతున్న అధికారులు, సొసైటీ సభ్యులు

చిల్లకూరు: ఎస్సీ, ఎస్టీలకు చెందిన మత్స్యకార సొసైటీల్లోని సభ్యులు చేపల పెంపకం చేపట్టి వాటి ద్వారా జీవనోపాధి పొందవచ్చని జిల్లా మత్స్యశాఖాధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని చిల్లకూరు, ముత్యాలపాడు, కడివేడు గ్రామాల్లోని చెరువుల్లో బుధవారం చేపల పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మత్స్యకార సొసైటీలుగా గుర్తించిన చెరువుల్లో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా చేపల పిల్లలను ఉచితంగా ఇస్తామని అన్నారు. ఇందులో భాగంగానే ఎస్టీ సొసైటీగా ఉండే చిల్లకూరు చెరువులో 1.50 లక్షలు, ఎస్సీ సొసైటీగా ఉండే ముత్యాలపాడు చెరువులో 2.50 లక్షలు, ఎస్సీ సొసైటీగా ఉండే కడివేడు చెరువులో 1 లక్ష చేప పిల్లలను వదిలామని అన్నారు. మూడు రకాల చేప పిల్లలను వదలడం ద్వారా చెరువుల్లో సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని అన్నారు. బొచ్చె, గండి, గడ్డి చేప పిల్లలను వదిలామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో చిల్లకూరు మత్స్యశాఖాభివృద్ధి అధికారి రఘుబాబు, టీడీపీ నాయకులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులు తరలిరండి



కరపత్రాలను ఆవిష్కరణ

గూడూరు రూరల్: తిరుపతి బైరాగిపట్టెడలో ఉన్న సీపీఐ కార్యాలయంలో ఈ నెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు కోరారు. గూడూరులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ ఏఐటీయూసీ అనుబంధ సంస్థ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభల్లో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలు, రాబోయే కాలంలో చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల రూపకల్పన చేస్తామన్నారు. అదే విధంగా నూతన కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటీయూసీ నాయకులు వెంకటయ్య, వి.ఆర్.నాయుడు, మేస్త్రీ చౌడయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను సక్రమంగా చెల్లించండి





హాజరైన వ్యాపారులు, అవగాహన సదస్సులో ఇన్‌కంట్యాక్స్ అధికారులు

సూళ్లూరుపేట: ఆదాయపు పన్ను సక్రమంగా చెల్లించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని తిరుపతి ఒకటో రేంజ్ ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్ వంశీధర్ వర్తక వాణిజ్య సంఘాలకు పిలుపునిచ్చారు. సూళ్లూరుపేట పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ సహాయ సహకారాలతో ఇన్‌కంట్యాక్స్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయపు పన్నుల శాఖ ఏసీ వంశీధర్ మాట్లాడుతూ వ్యాపారులకు ఆదాయపు పన్ను చెల్లింపులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆదాయపు పన్ను శాఖ అధికారి మోహన్‌కృష్ణ, స్థానిక వ్యాపార సంఘాల ప్రతినిధి వాకిచర్ల శాంతారావు, భాస్కరాచారి పాల్గొన్నారు.